# మానవా! నువ్వు - మారవా!

-పొం(దంకి సు(బమణి

ఒకే ప్రాంతాన నెక్లెస్ రోడ్డు వెన్నంటి ఎక్కువ ఎడం లేకుండా ఇద్దరి ఆఫీసులూ యిరుగు పొరుగులా ఉండటాన బావమరుదులిద్దరూ యేదో ఒక పూట కలుసుకోవడం ఆనవాయితీ అయిపోయింది. ఒకే వయసు వారవడం వల్లేకాదు - ఒకరి చెల్లిని మరొకరు చేసుకోవడం కూడా వాళ్ళ సాన్నిహిత్యానికి వారధిగా మలచింది. ఆదిలో బావమరుదుల్లాగే మెసలేవారు. చుట్టపు చూపుగా యోగక్షేమాలు విచారిస్తుండేవాళ్ళు. మెల్లమెల్లగా మనసులు విప్పుకున్న తరువాత క్రమేపీ బంధుత్వాల పరదాలు మరుగున పడి మొగ్గతొడిగిన పూలచెట్టులా స్నేహం విచ్చుకుంది.

భానుప్రసాద్ వేంకటాచలం పనిచేసే ఆఫీసుకు వచ్చి తిన్నగా క్యాంటీను హాలులోకి ప్రవేశించాడు. సాధారణంగా బయటివారిని అక్కడికి రానివ్వడం నియమ ఉల్లంఘనైనా అతడు వేంకటాచలానికి స్వయాన బావమరిదని తెలుసుకున్న సెక్యూరిటీ గార్డు అడ్డుచెప్పడం మానుకున్నాడు. అంతేకాదు- పలకరింపుగా నవ్వడం కూడా నేర్చుకున్నాడు. ఎప్పుడూ లేనిది బావ హాలు మూలన - అదీను కడపటి కోణాన ఒంటరిగా కూర్చోవడం అతడికి యిసుమంత విస్మయం కలిగింది.

బావమరిదిని చూసి వేంకటాచలం వెంటనే లేచి ఎదురుగా ఉన్న సీటువేపు చేయి చూపించి- కౌంటరు వేపు నడిచి వెళ్ళి ఒక కప్పు కాఫీ, రెండు మసాలా గారెల్ని తీసుకొచ్చి బల్లపై ఉంచాడు. "నువ్వు తీసుకోవా బావా?" కడుపునిండుగా ఉన్నట్లు పొట్టను తడిమి చూపించాడు వేంకటాచలం. కరకరలాడే గారెను చిదిమి చట్నీలో ముంచి నోట్లో వేసుకుంటూ- "బావా! మా గురువుగారి పెన్షన్ అకౌంటు సెటిల్‌మెంటు విషయమై కనుక్కున్నావా?" అని అడిగాడు భానుప్రసాద్.

బావ ప్రస్తావించిన పెన్షన్ సెటిల్‌మెంటు - అర్జంటు కేసు మాత్రమే కాదు - సర్వవిధాల సముచితమైన కేసు కూడాను. తన సూపర్‌వైజరీ హోదాను కూడా ఖాతరు చేయకుండా సీటు క్లర్కుని వెతుక్కుంటూ వెళ్ళి వచ్చాడు. గాలిలోకి తలను చాచి తొంగిచూసి ఆఫీసు పేపర్లు తప్ప ఆ కుర్ర క్లర్కు అయిపు కనిపించలేదు. జరిగింది వివరించి- "తారసపడి అడిగితే - ఒకసారి అది లేదంటాడు, మరొకసారి ఇది లేదంటాడు. వెతికీ వేసారీ తెచ్చిస్తే వివరాలు పూర్తిగా లేవంటాడు. లేకపోవడమేమిటి- శరభయ్యగారు ఆషామాషీ వ్యక్తి కారు. రిటైర్డు హెడ్మాష్టారు గారు. అన్ని కాగితాలనూ పకడ్బందీగానే పంపించి ఉంటారు. సరిగ్గా చూసి చెప్పండి అని గట్టిగా చెప్తే - 'అలాగే సార్' అని నక్క వినయంతో తలూపుతాడు."

వేంకటాచలం వేపు తేరిపార చూసి "అది వినయంతో చెప్పడం కాదు బావా! జారుకోవడం అన్న మాట. మరి మా గురువు గారిని ఊరినుంచి రప్పించమంటావా?" అని అడిగాడు భానుప్రసాద్.

"అంత దూరం నుంచి ఆయన్ను పిలవడమెందుకులే - మనం కేసుని ఎలాగూ ఫాలో చేస్తూనే ఉన్నాంగా! వీళ్ళందరూ యూనియన్ కార్యకర్తలు. వాళ్ళనెవరూ ముట్టుకోనివ్వకుండా యూనియన్ వ్యవహారాల్లో తలమునకలయి పోతున్నట్లు సీను సృష్టిస్తుంటారు. పై అధికారుల వద్దకు వెళ్ళి ప్రెజర్ పెట్టినట్లు తెలిస్తే- తాజ్‌మహల్‌ని మాయం చేసిన మెజీషియన్‌లా - కేసుని బెడిసికొట్టేలా చేయగలరు."

అది విని ఊరకుండిపోయాడు భానుప్రసాద్.

"ఒకవేళ శరభయ్య మాష్టారు గారిని పిలవాలనుంటే- అలాగే చెయ్యి బావా! మనింట్లో ఉంటారు. మీ చెల్లి ఆచార నియమాలు మిక్కిలి మక్కువతో పాటిస్తుందని నీకు తెలుసుగా. ఆయనిక్కడున్న ఆ మూడు రోజులూ మీ చెల్లే ఆలనా పాలనా చూసుకుంటుంది."

అది విని అంగీకారసూచకంగా తలూపుతూ- బావ ముఖంలోకి నిదానంగా చూస్తూ- "కొన్ని రోజులుగా ఎందుకో డీలాగా కనిపిస్తున్నావు బావా! మా కాంతం గాని ఏమైనా అందా ఏమిటి?" అన్నాడు

## ముగ్గు

ఇంటి ముంగిట / చుక్క ముగ్గులు
గళ్ళలో రంగులద్దడం / ఆమె నేర్పరితనం!
ఇంట్లో అందర్నీ / ముగ్గుల్లో దింపి
చదరంగం ఆట/ ఆమెదే నేర్పరితనం!

-లలితా మానస

భానుప్రసాద్.

అది విని రవంత విస్తుపోయినట్లు చూసి- ఉన్నపళాన గట్టిగా నవ్వేశాడు వేంకటాచలం. "నా వల్ల మీ చెల్లికేమైనా ఇబ్బంది కలుగుతుందేమోనని అడుగు. అది బాగుంటుంది. మా అమ్మ తరువాత ఇంటి పెద్దరికం అంతా మీ చెల్లిదే. మీ చెల్లివంటి స్త్రీని ఏదైనా అంటే మన కళ్ళను మనం పొడుచుకోవడం అన్నమాట."

"అది సరే బావా- మరి నీ ముఖంలో కనిపించే ఆ మసక గురించి చెప్పనంటావు."

బుర్ర ఊపుతూ- "అవును, వాస్తవం. అది నా ముఖాన కనిపించే మసక మాత్రమే కాదు. కళ్ళలో పడ్డ మెరిక కూడాను. కాని తీరా విషయం గాని విడమర్చి చెప్తే ఎదుటివారికి ఏమీ కానట్టు తోచవచ్చు" అన్నాడు.

"ఎవరి సమస్య వాళ్ళది. ఎవరి సమస్య వాళ్ళకు పెద్దదిగానే కనిపిస్తుంది. చెప్పు బావా."

"మరేం లేదు. నెల రోజులుగా భార్యాభర్తలిద్దరమూ ఓ విధమైన అలజడికి లోనవుతున్నాం."

"డబ్బు సమస్యా?"

వేంకటాచలం తల అడ్డంగా తిప్పి- "కాదు, విషయం అది కాదు. నీకు తెలుసు కదా- కాంతం బి.ఇడి. వరకూ చదువుకుంది. పరిస్థితులు అనుకూలించక ఉద్యోగం మానుకుని అమ్మనూ నాన్ననూ చూసుకుంటుంది. మీ చినబావమరది కాలేజీ చదువులు - వాడి బాగోగులన్నీ ఆవిడే చూసుకుంటుంది. పిల్లలిద్దరికీ పాఠాలు నేర్పుతుంది. అందులో మేథ్స్ లోతుగా- అదే సమయాన సరళంగా చెప్తుంది. వింటుంటే సబ్జెక్టు తెలియని వాళ్ళకు సయితం చక్కగా బోధపడిపోతుంది. ఆవిడ్ని చూస్తుంటే మా యింటి పరిస్థితుల కారణంగా స్కూలు పిల్లలు ఓ మంచి టీచరుని కోల్పోయారనిపిస్తుంది. అటువంటిది మరి..."

అక్కడ వేంకటాచలం ఆగిపోవడం చూసి "మరి?" అని రెట్టించాడు.

"మరి ఐ.క్యూ. లోపించడాన కావచ్చు. లేక శ్రద్ధాసక్తులు కొరవడిన కారణంగా కావచ్చు. మీ మేనల్లుడికి మార్కులు తక్కువగా వస్తున్నాయి" భానుప్రసాద్ రవంతసేపు మౌనం వహించి- "ఏమో బావా- మీ భార్యాభర్తలిద్దరూ అయోమయంలో పడినట్లున్నారు. ఏదైనా చెప్పండి - మా మేనల్లుడికి ఐ.క్యూ. తక్కువంటే నేను ఒప్పుకోను. అంతేకాదు- గ్రాహ్యశక్తిలో చురుకుదనంలో మీ మేనల్లుడి కంటే మా మేనల్లుడే ఒక అడుగు ఎత్తు" అన్నాడు సూటిగా ముఖం పెట్టి.

అది విని పైకి అనకూడదనుకుంటూనే అనేశాడు వేంకటాచలం. "భలే వాడివి బావా! మీ మేనల్లుడ్ని చంకనెత్తుకోవడానికి నా మేనల్లుడ్ని చతికిల పడేస్తావా? ఈ మధ్య సచిన్ టెండూల్కర్ ఫాంలో లేడన్నది మనందరికీ తెలుసు. అటువంటి వాతావరణంలో అప్పటి శ్రీలంక క్రికెట్ టీమ్ కెప్టెన్ ఆటపట్టుని ఓ ప్రశ్న వేశారు పాత్రికేయులు.

"మీ దృష్టిలో ప్రపంచం మొత్తాన ఎవరు గొప్ప - అంటే ది బెస్ట్ అండ్ ది గ్రేటెస్ట్ ఆటగాడనుకుంటున్నారు?"

దానికతడు ఓ క్షణం కూడా తడుముకోకుండా ఇచ్చిన జవాబు ఏమిటో తెలుసా? - సచిన్!

ధూళీ ధూసీ రేపడంలో అగ్రగణ్యులు కదా పాత్రికేయులు. ఊరుకుంటారా మరి.

"అదెలా? అతడికి ఫారమ్ పోయి వచ్చీ రావడంతోనే బ్యాట్ ఊపుకుంటూ వెళ్ళిపోతున్నారు కదా! మూడు వన్డే మ్యాచ్‌లలో అతడు సాధించిన పరుగులు మొత్తం - 21. అంటే- ఒక్కో గేమ్‌లో కేవలం ఏడు పరుగులు మాత్రమే తీశాడన్నమాట!" అని ఆటపట్టుని రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు.

దీనికి అతడు ఏమాత్రమూ చెక్కుచెదరకుండా ఏక వాక్యంలో ఇచ్చిన జవాబు- "ఆయన ప్రపంచం

## ఎవరి తల్లి?

ఊపిరంత నిజం కాదా / నేల తల్లితో బంధం!?
మరుపెలా వస్తోంది మనిషికి / నగరాల సోయగం
మాయ జలతారు దారాల లాగితే మాత్రం?
ఎక్కడ నుంచొచ్చామని
మనమీ ఎచ్చులు పడుతున్నాము?
ఎవరికి మించిన వాళ్లమని
మనమీ గొప్పలు పోతున్నాము?

గాంధారి పోషణకు బాధ్యులెవరని
నూరుగురు కౌరవులు కొట్లాడినట్లుంది
ధరిత్రి సదస్సులో దేశాల జగడం.
దుర్యోధనుడూ మరో వాడూ
తలో కారణం చెప్పే వెళితే
అవాక్కయింది ధరిత్రి పాపం!

-విద్యాసాగర్ అంగళకుర్తి

మొత్తాన గొప్ప ఆటగాడని నేనడం లేదు. రికార్డులే చెబుతున్నాయి."

దానితో పాత్రికేయులు నోరు మెదపకుండా జారుకున్నారు.

అప్పుడు భానుప్రసాద్ అడ్డువచ్చి- "చదువుకీ గేమ్‌కీ మధ్య పొంతనేమిటి బావా" అని అడిగాడు.

"ఉంది. మీ మేనల్లుడి చదువు కప్పగెంతులు వేస్తుందనడానికి ఆధారాలున్నాయి. కాని మీరిద్దరూ వాడిని పుల్లవిరుపు మాటలతో నిర్వీర్యుణ్ణి చేయకండి. నేను సావధానంగా విషయాన్ని విడమర్చి - తెల్లని పాలను - నల్లని నీళ్ళను విడదీసి విపులీకరిస్తాను. కుర్రాళ్ళిద్దరూ చదువుతున్నది ఒకే స్కూలులో- ఒకే క్లాసులోనేగా! చాలా సంగతులు రాబట్టుకోవచ్చు. ఈ లోపల మీరిద్దరూ ఎక్కువగా ఫీలవకండి"

వేంకటాచలం నవ్వి- "ఎక్కువగా ఫీలవుతున్నది నేను కాదు- మీ బంగారు చెల్లి. మీ నాన్నగారిలా కొడుకుని డాక్టరు చేయలేనేమోనని బెంగపెట్టుకుంది."

❖ ❖ ❖

మరునాడు కాఫీ టైముకి క్యాంటీను వేపు వెళ్తూన్న వేంకటాచలం బావమరిది ఎదురుగా రావడం చూసి ఆశ్చర్యంగా నిల్చున్నాడు. "అదేంటి బావా- మీ గురువుగారి సెటిల్‌మెంటు కేసంటే మాటలా- ఎన్నేళ్ళ రికార్డులు తెరిచి చూడాలి. ఎన్నెన్ని వివరాలు రాబట్టుకోవాలి. ఆయనగారి మూడు దశాబ్దాల పైచిలుకు సర్వీసు సేకరించవద్దూ!"

వేంకటాచలం మాటలకు అడ్డువచ్చి- "నేనిప్పుడు వచ్చింది మా గురువుగారి కేసు గురించి కాదు. మా మేనల్లుడి కేసుని డిటెక్టివ్ యుగంధర్‌లా ఛేదించి చిక్కుముడి విడదీశానని చెప్పడానికి వచ్చాను."

వేంకటాచలం ఏమీ అనకుండా బావమరిదిని లోపలకు తీసుకెళ్ళి తను మాత్రం కాఫీ తీసుకుంటూ- భానుప్రసాద్ ముందు బిస్కెట్లతో కాఫీ కప్పు ముందుంచాడు. తాపీగా బిస్కెట్లు నములుతూ కాఫీ చప్పరిస్తూ- చిర్నవ్వు చిందిస్తూ చెప్పసాగాడు.

"నువ్వూ మా చెల్లీ అనవసరంగా కంగారు పడిపోతున్నారు బావా! అసలు సమస్య అంతా వాళ్ళ టీచరమ్మ ఇంటి నుంచే పుట్టుకొస్తున్నది."

అది విని వేంకటాచలం విస్తుపోయినట్టు చూసి- "ఇదెలా నమ్మడం బావా! కుర్రాళ్ళ ఇద్దరి టీచరూ ఒక్కరే. ఇద్దరికీ మార్కులిచ్చే ఉపాధ్యాయిని కూడా ఆమెగారే. మీ మేనల్లుడు నిజంగా బాగా చదివుంటే- కక్ష కట్టినట్టు వాడికెందుకు తక్కువ మార్కులివ్వాలి" అని తేరిపార చూశాడు వేంకటాచలం.

"చూడు బావా- ఒక విషయం మాత్రం ఇప్పుడే ఇక్కడే తేల్చి చెప్పేస్తున్నాను. మళ్ళీ మళ్ళీ మనం వాదనకు దిగనవసరం లేదు. రాఘవ బ్రిలియంట్ స్టూడెంటు. మరెందుకిలా తక్కువ మార్కులు తెచ్చుకుంటున్నాడనే కదూ మీ భార్యాభర్తలిద్దరి గోడూ. ఆ పీటముడినే ఛేదించుకొచ్చాను. క్లాసు టీచరమ్మ గారు ప్రైవేటుగా సొంత ట్యుటోరియల్ సంస్థలు నడుపుతున్నారు. కాసులు రాశిగా పోసుకుంటున్నారు. సాయంత్రం పూట మీ మేనల్లుడు అక్కడకు వెళ్ళి వస్తున్నాడు. మా మేనల్లుడిని మీరక్కడకు పంపించడం లేదు. అదీ దీని వెనకున్న మిస్టరీ! అయినా ఇప్పుడు సంపాదించే మార్కులన్నీ ఎండాకాలపు మేఘాల వంటివే కదా- కావాల్సిన సబ్జెక్టులు సంపాదించేందుకు ఫైనలియర్ మార్కులే కదా ప్రధానం!" అది విని మాటా

---

## అలసి సొలసి విశ్రమించే వేళ...

ఆధునికత అంతర్నాటకంలో
మనస్సు సంకుచితమై
మనుగడ స్వలాభమై
చెట్టు మోడువారక మునుపే
నరికివేసే విష సంస్కృతి
చాపక్రింద నీళ్ళుగా విస్తరించి
పేగు బంధాన్ని, ప్రేమ బంధాల్ని
తరలించేస్తున్నాం వృద్ధాశ్రమాలకు
మన అధోగతికి నిదర్శనంలా...
ఎండు నీడై, వానకు గొడుగై
చీకటిలో వెలుగై ఆపదలో తోడై
పిల్లల ఉజ్వల భవితకై
నిస్సారమైన తల్లిదండ్రులు
అలసి సొలసి విశ్రమించే వేళ
పండుటాకులా రాలే వేళ
పలకరింపే పన్నీటి జల్లుగా
పట్టెడన్నమే పరమాన్నముగా
కడపటి వీడ్కోలు వరకు
కాసింత కరుణ(o) చూపుదాం...
కాలచక్ర భ్రమణంలో రేపటి
వృద్ధాప్యం వారసులమేగా...

**-మాదిరెడ్డి రత్నమంజరి**

పలుకూ లేకుండా బావమరిది ముఖంలోకి చూస్తూండి పోయాడు వేంకటాచలం.

❖ ❖ ❖

ఆ రోజు ఉదయం రాఘవ- "బాబూ! బాబూ! ఇలా రండి" అని రవంత ఉక్రోశానికి లోనవుతూ తండ్రిని పిలిచాడు. చేనేత పంచె కట్టుకుని పైన అంగవస్త్రం వేసుకుని పూజాగదివేపు నడుస్తున్న వేంకటాచలం ఆగి వెనక్కి తిరిగి- ఏమిటన్నట్లు చూపులు సారించాడు. "ఇక్కడికి రండి బాబూ!" నగరం నడిబొడ్డున అదేదో భయంకర బాంబు పేలుళ్ళ విషయం అయుంటుం దేమో- అనుకుంటూ హాలు లోపలకు వెళ్ళి కొడు కందిచ్చిన దినపత్రిక అందుకొని సంగతేమిటన్నట్లు కనుబొమలెగరేశాడు.

"ఈ అంకుల్ నాకు తెలుసు బాబూ!"

"సో వాట్?"

"ఈ అంకుల్ మరెవరో కాదు. మా క్లాసు టీచరమ్మ భర్త బాబూ!" ఈసారి వేంకటాచలం వేగంగా నడుస్తూ లోపలకు వెళ్ళి కళ్ళద్దాలు తెచ్చుకుని చూశాడు. అంతులేని అక్రమార్జనలకు పడగెత్తిన వ్యక్తి ఫొటో అది. ఒక్కొక్క చేతికీ మూడేసి ఉంగరాలున్నాయి. ముంజేతికి బంగారు బ్రాస్‌లెట్. వైట్ గోల్డుతో చేసిన గొలుసులో వజ్రాలు హృదయం షేపులో తళుకులీను తున్నాయి. సివిల్ సప్లయిస్ డిపార్టుమెంటులో లెక్కకు మాత్రమే కాదు- ఊహకందనంత సొత్తు చేర్చాడు. భార్యామణి సహాయంతో ఏకోన్ముఖాన ధన ప్రవాహం మళ్ళించేలా నాలుగు చెరుగులా ట్యుటోరియల్ విద్యా సంస్థలు తెరిచారు. డిపార్టుమెంటుతో సంబంధం ఉన్న పలు కాంట్రాక్టర్లతో అక్రమ లావాదేవీలు జరిపి బినామీ పేర్లతో వివిధ బ్యాంకులలో లాకర్లు తెరిచి నగదుతో పాటు గంపెడంత బంగారు కాసులు చేర్పించాడు. ఇవి చాలక నాలుగు పోష్ ఏరియాలలో ఆరు అపార్టు మెంట్లు కొని అద్దెకిచ్చాడు. మొత్తానికి అంతా చేర్పిస్తే- కోటికి పైమాటే! అరెస్టుచేసి స్పెషల్ కోర్టుకి లాక్కెళుతూన్న ఏ.సి.బి. వాళ్ళు పాత్రికేయుల్ని పక్కలకు నెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అసంకల్పితంగా వేంకటాచలం టీచరమ్మ భర్త ముఖంలోకి పరీక్షగా చూశాడు. ఆశ్చర్యం- అతడి ముఖాన ఇసుమంత దిగులు గాని- గుబులు గాని ద్యోతకమవడంలేదు. ఇదంతా మామూలే సుమా అన్నట్లు గంభీరంగా చూపులు సారించి చూస్తున్నాడు.

"ఒరేయ్ రాఘవా! ఇలా రా!" కొడుకుని పిలిచాడు.

భుజాన వేసుకున్న స్కూలు బ్యాగు సర్దుకుంటూ వచ్చాడు రాఘవ.

"ఈ బొమ్మల్లో ఎక్కడా మీ టీచరమ్మ కనిపించ లేదేం?

"చాలా రోజులుగా మా క్లాసు మామ్ స్కూలుకి రావడంలేదు."

"ఎందుకు?"

ఆ ప్రశ్నకు ప్రత్యుత్తరంగా తనకు తెలియదన్నట్లు రెండు చేతులూ విప్పి - పెదవులు విరిచి చూపించాడు రాఘవ.

వేంకటాచలం వెంటనే బావమరిదికి ఫోను చేశాడు. భానుప్రసాద్ చెప్పిందంతా విస్మయంతో వింటూ- "అలాగా!" అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఆ లోపల స్కూలు ప్రోగ్రెస్ రిపోర్టులు చేతబట్టుకుని కొడుకుతో బాటు స్కూలుకెళ్ళడానికి చీరకట్టుకుని నుదట తిలకం దిద్దుకుంటూన్న కాంతం- "ఏమయిం దండీ? పూజా గృహంలో లేకుండా ఇక్కడున్నారు. మా అన్నయ్యతో కూడా మాట్లాడినట్లున్నారు. సీరియస్ విషయం కాదు కదా!" అని అడిగింది.

"కొంచెం సీరియస్ విషయమేనోయ్. పది రోజుల ముందు వీళ్ళ క్లాసు టీచరుని ఇచ్ఛాపురానికి బదిలీచేసి, జాయినింగ్ టైము తీసుకోకూడదంటూ హుకుమ్ జారీచేశారట. ఆమె అక్కడకు చేరీ చేరక ముందే చేతికి సస్పెన్షన్ ఆర్డర్లు అందించారట. ఆమెగారికి వ్యతిరే కంగా మొత్తం మూడు ఎంక్వయిరీలు ప్రారంభించా రట. రెండు అడ్మినిస్ట్రేటివ్ ఎంక్వయిరీలు- ఒకటి విజిలెన్సు ఎంక్వయిరీ. కేసు ఎంత సీరియస్ అయిం దంటే- పెన్షనరీ బెనిఫిట్స్ లేకుండానే ప్రీ మెచ్యూర్ రిటైర్మెంట్ ఇచ్చేటట్టున్నారు."

అది విని కాంతం నిర్వికారంగా రెండు చేతుల్నీ నెత్తిన పెట్టుకుని కుర్చీలో కూలబడింది. అప్పుడామె మెదడు పొరన ఏదో జ్ఞాపకం వచ్చి తటాలున లేచి పూజా గదిలోకి ప్రవేశించింది. భక్తితో అరమోడ్పు కళ్ళతో గోడపైన వేలాడుతున్న పసుపు రంగు పలక వేపు చూసింది. ఆ పలకపై లిఖించబడ్డ వ్యాఖ్యలను తనకు మాత్రమే వినిపించేలా చదవుకుంది.

"ఇచ్ఛ నుంచి ఉత్పన్నమవుతుంది నిరాశ. నిరాశ నుంచి తొంగి చూస్తుంది క్రోధం. అటుపిమ్మట క్రోధం నుంచి పుట్టుకొస్తుంది- అహంకారం. అలా పుట్టు కొచ్చిన అహంకారం అజ్ఞానమనే అగాధం వేపు దారి చూపిస్తుంది"- ఉపనిషత్తులు.

❖ ❖ ❖

శరభయ్య మాష్టారు గారి పెన్షన్ పేపర్లు గ్రాట్యుటీ వ్యవహారాలూ తేలకుండా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టు డోలాయమానంగా వేలాడుతూనే ఉన్నాయి. ఊరిస్తూ- ఉవ్విళ్ళూరిస్తూ ఆశల మడతల మధ్య- కాగితాల రూపంలో ఎగురుతూ వాలుతూనే ఉన్నాయి.

ఆ రోజు ఉదయం క్యాంటీను హాలులోకి వచ్చి బావమరిది కోసం చూపులు సారించి చూశాడు భానుప్రసాద్. వేంకటాచలం కనిపించలేదు. చరచరా నడుచుకుంటూ మెట్లెక్కి సెక్షన్‌కి వెళ్ళాడు. అతడి సీటు మాత్రం కనిపించింది. బావమరిది ఉనికి గురించి ఆరా తీయడానికి స్టాఫ్ వద్దకు చేరేలోపల వేంకటాచలం రానేవచ్చాడు. వివర్ణమై ఉన్న అతడి ముఖాన్ని హాసరేఖలతో కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తూ- "ఎంత సేపయింది బావా నువ్వొచ్చి?" అని అడుగుతూ చేతిలోని ఏవో పేపర్లు పరపరా చింపి చెత్తబుట్టలో పడేసి- భుజంపైన చేయివేసి భానుప్రసాదుని బయటకు నడిపించాడు వేంకటాచలం!

## ధరాఘాతం

**చు**క్కల్లో ధరలు...
ఆకాశంలో అందనంత ఎత్తున,
రౌతు మెత్తనై
ధరల గుర్రాలకి కళ్ళేలు సడలి
ప్రజల జీవిత వీధుల్లో స్వారీ చేస్తున్న రోజులు
పెట్రోమంటకి కళ్ళు పచ్చబడి
ఎద్దుల బళ్ళతో
గుర్రపు బగ్గీలతో
ప్రయాణపు దిశమార్చుకోవాల్సి వస్తుందేమో!
ప్రాణాల కోసం మందులకు బదులు
చెట్ల ఆకులు, వేళ్ళూ, నమ్ముకోవాల్సి వస్తుందేమో!
ధరల శరాఘాతానికి
నాలుగు వేళ్ళూ లోపలికి పోవటమే
గగనమైపోతున్న జనం ఆకలితో సావాసం!
ధరల్ని ఆకాశ వీధుల నుండి
భూ మార్గం పట్టించేవాడికోసం
చాతక పక్షుల్లా ఎదురు చూస్తూ
బీద బిక్కి
కాల ప్రవాహంలో కలిసి సాగటం మినహా
గత్యంతరం కనిపించటంలేదు.

**-నూతలపాటి వెంకట రత్నశర్మ**

క్యాంటీను హాలులో బావమరుదులిద్దరూ ఎదురెదురుగా కూర్చొని- కొత్తగా చూసుకుంటున్నట్లు- కాసేపు ఒకరి ముఖం ఒకరు తదేకంగా చూసుకున్నారు. మనసును కల్లోల స్థితిలా సమస్థితికి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ- ఓసారి లోతుగా ఊపిరి పీలుస్తూ లేచి- రెండు కప్పుల కాఫీ తెచ్చి బల్లపై వుంచాడు వేంకటాచలం. భానుప్రసాద్ కాఫీ కప్పు చేతిలోకి తీసుకోకుండా బావమరిదినే చూడసాగాడు. కాఫీ చప్పరిస్తూ నిడుపాటి మౌనం వహించి- ఆ తరువాత ఏమైందో తేల్చుకునే లోపల వేంకటాచలం ఫెళ్ళు ఫెళ్ళున గట్టిగా నవ్వేశాడు. ప్రతి మనిషికీ అరుదుగా అతి విచిత్రంగా ఏదో ఒక సందర్భాన స్ప్లిట్ పర్సనాలిటీ వంటి చేతనా ప్రక్రియ తన్నుకు వచ్చేస్తుంది. అటువంటిదే వేంకటాచలానికి సంభవించింది.

"ఈ రోజు పెన్షన్ క్లర్కుతో గొడవ జరిగింది బావా! అందుకే ఉదయం కొంచెం మూడ్ పాడయింది".

అలాగా అన్నట్టు భానుప్రసాద్ బుర్రూపాడు.

"పైన నీ ముందు కొన్ని పేపర్లు చింపి పడేశాను కదా- అవేమి పేపర్లనుకున్నావు? ఆ కుర్ర క్లర్కుకి వ్యతిరేకంగా విజిలెన్సు డైరెక్టరుకి వ్రాసిన వివరమైన ఫిర్యాదు దరఖాస్తు. శరభయ్యగారి వద్ద నుంచి పెన్షన్ పేపర్లు చేరిన తేదీ నుంచి - ఇప్పటివరకూ అతడు లేవదీసిన కాకమ్మ కొర్రీలు- అతడెన్నాళ్ళు పేపర్లు వెనక్కూ ముందుకూ తిప్పాడు- ఇవన్నీ తేదీల వారీగా విజిలెన్సు డైరెక్టరు గారికి స్వయంగా యిచ్చిరావాలనే బయల్దేరాను."

"వావ్! ఎంతటి విచిత్ర యాదృచ్ఛికం! చూశావా బావా- మన మనసులెలా కలసిపోతున్నాయో. నీలాగే నేను కూడా మా గురువుగారి వద్ద నుంచి ఫిర్యాదు పత్రం వ్రాసుకొచ్చాను. మీ శాఖాదిపతికి స్వయంగా అందజేసి రావడానికి."

"అలాగా! నేను ఫిర్యాదు లెటర్‌ని విజిలెన్స్ డైరెక్టరు గారికి ఇవ్వబోయే ముందు నాలోని అంతర్వాణి నన్నెందుకో ఆపింది బావా! ఆఖరుసారిగా అతడి సీటుకి వెళ్ళి స్వయంగా వాకబు చేశాను. "నువ్వు కావాలనే కదూ- ఒక పెద్దాయన జీవితంలో గందరగోళం సృష్టిస్తున్నావు?" అని నిలదీశాను.

వాడి అదృష్టం- ఆ లోపల మీ గురువుగారి పెన్షను కేసుని గ్రాట్యుటీతో సహా సెటిల్ చేసి ఉంచాడు. నేను వెళ్ళగక్కిన అక్కసు చూసి పెన్షన్ క్లర్కు చలించలేదు. చిర్నవ్వుతో లేచొచ్చి నన్ను నడవమ్మట తీసుకెళ్ళి

నిదానంగా ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు?

"సర్వీసులో మీరు పెద్దలు, ఈ పాటిది తెలుసుకోవ దానికి ఇంత ఆలస్యమా!" నిస్సంకోచంగా చూస్తూ అన్నాడు. నాకు చెంప ఛెళ్ళుమన్నట్లనిపించింది.

"ప్రతి నెలా ఒకటవ తేదీన ఠంచన్‌గా జీతంరాళ్ళు దోసిళ్ళలో అందుకుంటున్నవాడివి. ఇలా బాహాటంగా చెప్పడానికి సిగ్గేయడంలేదూ?" అని అడిగాను.

"ఈ ఒక్క వ్యాఖ్యానానికీ మరొకడి ముఖమైతే మండే చంద్రకాయలా భగ్గుమనేది. కాని అతడి ముఖం ముడుచుకోలేదు సరికదా- బదులుగా యేమన్నాడో తెలుసా?"

చెప్పమన్నట్టు తలాడించాడు భానుప్రసాద్.

"అవును- నిజం చెప్తున్నాను. నాకు సిగ్గు లేదు. ఈ ఆఫీసు ఆవరణలో కాలుమోపినప్పుడే సిగ్గూ లజ్జా అంతా నడిరోడ్డు మధ్యనే దులిపేసి వచ్చాను. మన సమాజంలో మనుగడ సాగించాలంటే ఇంగిత జ్ఞానం కాస్తో కూస్తో ఉన్న ప్రతి వ్యక్తీ రెండు గుణాంశాలను విడిచిపెట్టేస్తాడు. అవి- సిగ్గు, మనస్సాక్షి. అలా చేయ కుండా ఉండాలని తీర్మానించుకున్ననాడు- బిచాణా ఎత్తేసి ఆశ్రమంలో చేరాలి."

వాడి ప్రసంగం విని- ఒళ్ళు మండి చరచరా నడిచి వెళ్ళి ఫిర్యాదు లెటర్ విజిలెన్సు వాళ్ళకు ఇచ్చి రావాలనే నిశ్చయించాను. కాని అతడి చివరి మాట విని- అయోమయంలో పడి- ఆగిపోయాను బావా!"

"లేదు బావా! అటువంటి వాడిపైన ఫిర్యాదు వ్రాసే తీరాలి. వాడు చెడింది కాక- మరో నలుగురిని చేరదీసి చెడుపుతాడు."

"అతడన్న మాటలు నేను విన్నాను. మరి నువ్వు కూడా వినాలి కదా బావా!" భానుప్రసాద్ సావధా నంగా తలూపాడు.

"అతడికి ఇద్దరు అక్కా చెల్లెళ్ళు. తోబుట్టువుల చదువులు మాన్పించిన వాళ్ళ తండ్రి అతడికి సిటీ హైస్కూలులో సీటు ఇప్పించడానికి అర ఎకరం మాగాణి అమ్మివేశాడు. ఆ తరువాత కాలేజీలో సీటు ఇప్పించడానికి- డొనేషన్ రూపాన డబ్బులివ్వడానికి మరొక ఎకరం మాగాణి తాకట్టు పెట్టేశాడు. చివరిగా కూతురి పెళ్ళి వాయిదావేసి, ఇతగాడికి గవర్నమెం టులో ఉద్యోగం ఇప్పించడానికి- బహిరంగంగా సంతలో వేలం వేసే చోట నిల్చున్నట్టు- బిడ్డింగులో పాల్గొనడానికి మరొక ఎకరం తాకట్టుపెట్టి కొడుక్కి ఉద్యోగం ఇప్పించాడు. ఇదంతా చెప్పి ఆ కుర్ర క్లర్కు తిరుగు ప్రశ్న వేశాడు. "కుప్పలా ప్రోగులు చేసిన అప్పుల్ని నేనే కదూ తీర్చాలి. పోగొట్టుకున్న మాగాణిని నేనే కదూ రాబట్టుకోవాలి. మా అక్కయ్య పెళ్ళితో బాటు మా చెల్లి పెళ్ళి కూడా నేనే కదూ చేయాలి. ఇప్పుడు చెప్పండి- నెల నెలా వచ్చే నా ఒక్కడి జీతంతో నేనివన్నీ చేయగలనంటారా? మీ వంటి వారిని- ఒకరిద్దర్ని మినహాయిస్తే- మన ఆఫీసులో- ఆ మాటకొస్తే మన దేశంలో గాని- ఏ ఒక్కరూ చేయని కార్యాన్ని నేను మాత్రమే చేస్తున్నానా? బలిసిన పెదబాబుల ముందు నేనొక చుంచెలుక వంటివాడిని కానా!

నిజం చెప్తున్నాను బావా- ఆ కుర్ర క్లర్కు ఇచ్చిన విశ్లేషణకు దిగ్భ్రాంతి చెందాననుకో. అదేదో పచ్చి మాంసపు వాసన ముక్కుపుటాలకు సోకినట్లు కడుపంతా దేవినట్లయింది. ఎంతయినా ఉప్పూ కారమూ తింటున్నవాణ్నేగా- ఉక్రోషమూ ఆవేశమూ కలగాపులగమై నన్ను ఊపిపారేశాయి. నోరు విప్పి జవాబు ఇవ్వలేకపోయానే గాని- వేరొక విధంగా బదులిచ్చే వచ్చాను. మరి నాలోని ఆక్రోశం తగ్గొద్దూ!"

"చెమడాలూడిపోయేలా తిట్టొచ్చినట్లున్నావు."

"కాదు. అతడ్ని మర్యాదగా కారిడార్ చివరకు తీసుకెళ్ళి ఎవ్వరి అలికిడీ లేని సమయాన ఆ కుర్ర క్లర్కు గూబలదిరిపోయేలా చాచి లెంపకాయ కొట్టాను."

"ఇంకెందుకు బావా- అంత ఆవేశం! నువ్వెళ్లే టప్పటికే మా గురువుగారి పెన్షన్ కేసు సెటిల్ చేసేశా డన్నావుగా! అదీగాక- గుండెలోని గోడంతా నీ పాదాల వద్ద గుమ్మరించేశాడుగా!'

"కావచ్చు. కాని నేను నిజంగా దెబ్బ కొట్టింది ఆ కుర్ర క్లర్కుని మాత్రమే కాదు. నైతిక విలువల పట్ల ఏమాత్రమూ అక్కర చూపించకుండా తామరతంపరలా లేచిన విద్యా సంస్థలను గురిచూసి కొట్టాను. మానవ చిత్త ప్రవృత్తుల్ని నానాటికీ అమానవీయంగా తీర్చిదిద్దు తూన్న వ్యాపారీకరణ వాతావరణాన్ని సూటిగా గురి పెట్టి కొట్టాను. ఆఖరిగా- ఎవ్వరి పట్లా ఏ విధమైన హానీ తలపెట్టని నీ వంటి నా వంటి వారిని - శర భయ్య మాష్టారు వంటి పరమ పూజనీయుల్నీ అకార ణంగా రాచి రంపాన పెడుతూన్న నేటి నవసమాజ వెన్నపాముని గురిచూసి కొట్టాను. ఆ కుర్ర క్లర్కుకి దమ్ముంటే నా పైన యూనియన్ వాళ్ళకు - మేనేజ్ మెంట్ వాళ్ళకు కంప్లెయింట్ ఇచ్చుకోమను." ■